క్లుప్తంగా

సంత ఆశీల వసూళ్లకు టెండర్లు

చింతపల్లిరూరల్: పెదబరడ పంచాయతీ లోతుగడ్డ జంక్షన్ వద్ద నిర్వహిస్తున్న వారపు సంతకు సంబంధించి ఆశీల వసూళ్లకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్టు కార్యదర్శి పూర్ణచంద్ర రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ముందుగా రూ.10 వేలు డిపాజిట్ చేసి పేరు నమోదు చేసుకోవాలన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు జరగనున్న వేలంపాటకు పేర్లు నమోదు చేసుకున్న వారు హాజరు కావాలని ఆయన కోరారు.

తాగునీటి పథకం పనులు ప్రారంభం


సింగర్బలో తాగునీటి పథకం పనులు చేస్తున్న గిరిజనులు

జి.మాడుగుల: మండలంలోని సింగర్బ పంచాయతీ కేంద్రంలో ఎంపీటీసీ నిధులతో చేపట్టిన తాగునీటి పథకం పనులను ఎంపీటీసీ సభ్యురాలు పాంగి లక్ష్మి, సర్పంచ్ ఎం.కొండమ్మ బుధవారం ప్రారంభించారు. గ్రామంలో ప్రజలకు తాగునీటి అవసరాలు నిమిత్తం ఎంపీటీసీ నిధులు రూ.1.70లక్షలతో ట్యాంక్, కుళాయిల పనులు చేపడుతున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చిట్టిబాబు, గంగరాజు, సూర్యప్రకాష్‌నాయుడు, కన్వీనర్ రామకృష్ణ, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పశువైద్య శిబిరాలు


పశువైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్ చరణ్, పాడిరైతులు

హుకుంపేట: మండలంలోని రంగశీల, సరసుపాడు గ్రామల్లో హుకుంపేట, బాకురు పశువైద్యాధికారులు డాక్టర్ చరణ్, డాక్టర్ వరప్రసాద్‌ల ఆధ్వర్యంలో బుధవారం పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. పశువులకు నట్టల నివారణ వ్యాక్సినేషన్ వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని సూచించారు. పశువులు అనారోగ్యం బారిన పడితే స్థానిక వైద్య సిబ్బందికి సమాచారం అంచాలన్నారు. సిబ్బంది ప్రేమమల్లి, సుజాత, శేఖర్, బుజ్జిబాబు, బాలన్న, సోమ, దొన్ను, సన్యాసి తదితరులు పాల్గొన్నారు.

రేపు మన్యం బంద్

డుంబ్రిగుడ/కొయ్యూరు/చింతూరు/రాజవొమ్మంగి/ఎటపాక/గంగవరం: బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చొవద్దని కోరుతూ శుక్రవారం మన్యం బంద్ నిర్వహిస్తున్నట్టు గిరిజన సంఘం, ఆదివాసీ సంఘం, ఆదివాసీ జేఏసీ , కాంగ్రెస్ నాయకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శాంతకుమారి, సూర్యనారాయణ, సూరిబాబు, సురేష్, సీతారామయ్య, రామకృష్ణ, అర్జున్‌దొర, వెంకటేశ్వర్లుదొర తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

జి.మాడుగుల: సకాలంలో వేతనాలు చెల్లించాలని ఎండీయూ(మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్)ల మండల అధ్యక్షుడు మత్స్యకొండబాబు ఒక ప్రకటనలో తెలిపారు. హెల్పర్లకు బకాయి వేతనం, డీజిల్ ఖర్చులు చెల్లించలేదన్నారు.

5న చలో ఢిల్లీ

అరకులోయ రూరల్: స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో బుధవారం కార్మిక సంఘాల నాయకులతో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బాలదేవ్ సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కులను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. కేంద్రం అమలుచేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సమష్టిగా పోరాడాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. ఉపాధి కూలీలకు 200 పని దినాలు కల్పించాలన్నారు. కార్మికుల డిమాండ్ల పరిష్కారానికి ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమం చేపడుతున్నామని, కార్మిక సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మగ్గన్న, సింహాద్రి,రాజు,సుందర్,బాలన్న,ఆనంద్,తదితరులు పాల్గొన్నారు.

లాభసాటిగా వ్యాపారం

- హాట్ కేకుల్లా అమ్ముడైన నాటుకోళ్లు, మేకలు, గొర్రెలు
- వారపు సంతల్లో రూ.లక్షల్లో లావాదేవీలు


వారపు సంతకు తీసుకొచ్చిన మేకలు


విక్రయించటానికి తీసుకొచ్చిన నాటుకోళ్లు

జి.మాడుగుల: అల్లూరి జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లో జరిగే వారపు సంతల్లో నాటుకోళ్లు, మేకలు, గొర్రెలు హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. జి.మాడుగుల సంతబయలు గ్రామంలో మంగళవారం జరిగిన వారపు సంతకు అధికంగా మేకలు, గొర్రెల నాటు కోడి పుంజులను పెంపకందార్లు తీసుకొచ్చారు. గ్రామాల్లో పండగలు గ్రామ జాతరలు సందర్భంగా వారపు సంతల్లో నాటుకోళ్లు, మేకలు, గొర్రెలు ధరలకు రెక్కలొచ్చాయి. పెంపకందారులు చెప్పిన ధరలకు వినియోగదారులు, వ్యాపారులు అధిక ధరలు చెల్లించి కొనుగోలు చేశారు. వారపు సంతల్లో ఇవి హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి.గిరిజన ప్రాంతంలో గల మండలాల్లో వారపు సంతలు జరుగుతున్నాయి. నాటుకోళ్లు, మేకలు, గొర్రెలు ధరలు పెరిగిపోతాయని భావించి పండగలకు ముందుగానే వినియోగదార్లు నాటుకోళ్లు, మేకలు, గొర్రెలు కొనుగోలు చేస్తున్నారు. నియోజకవర్గంలో పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు మండలాల్లో వారపుసంతలు జరుగుతాయి. ఆయా మండలాల్లో ఆదివారం నుంచి శనివారం వరకు ఏదోక చోట వారపుసంత జరుగుతూనే ఉంటాయి. నాటుకోళ్లు, మేకలు, గొర్రెల పెంపకందారులకు వారపు సంతలే మార్కెట్‌లుగా మారాయి. దీంతో పెంపకందార్లు ఎక్కువగా సంతలకే ప్రాధాన్యత ఇచ్చి వీటిని విక్రయిస్తున్నారు. వారపు సంతల్లో నాటుకోళ్లు, మేకలు, గొర్రెలు డిమాండ్‌ను బట్టి పెంపకందార్లు ఒక్కసారి ధరలు పెంచారు. మైదాన ప్రాంతాల్లో వీటి ధరలు మరింత అధికంగా ఉండటంతో వ్యాపారులు, దళారులు వారపుసంతల్లో నాటుకోళ్లు, మేకలు, గొర్రెలును కొనుగోలు చేసి మైదాన ప్రాంతాలకు వాహనాల ద్వారా తరలిస్తున్నారు.

అమ్మకాలు జోరుగా

వారపు సంతల్లో 1 కిలో నాటుకోడి రూ.800 నుంచి రూ.900లకు, 10 కిలోల మేక, గొర్రెలు రూ.10,000 – రూ.11,000 వరకు ధర పలికింది. నాటు కోళ్లకు, మేకలు, గొర్రెలకు ఆశించిన ధరలు లభిస్తున్నాయని పెంపకందార్లు ఆనందం వ్యక్తం చేశారు. జి.మాడుగుల వారపు సంతలో ఈ వారం సుమారు 100 నుంచి 150 మేకలు, గొర్రెలు, 100 నాటుకోళ్ల విక్రయాలు జరగ్గా సుమారు రూ.15లక్షలు లావాదేవీలు జరినట్టు పెంపకందారులు తెలిపారు.

ధరలు బాగున్నాయి

గ్రామ జాతర, పండగలు జరుగుతుండడంతో నాటుకోళ్లు, మేకలు ధరలు పలుకుతున్నాయి. తమ ఇళ్ల వద్ద పెంచుతున్న వీటిని జాతరలు, పండుగ సమయాల్లో వారపు సంతలకు తరలించి విక్రయిస్తుంటాం. నాటుకోళ్లు, మేకలు, గొర్రెల ధరలు ఆశాజనకంగా ఉన్నాయి.

– సుబ్బారావు, సొలభం గ్రామం, జి.మాడుగుల మండలం

క్రీడలతో మానసిక స్థైర్యం


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి బాలరాజు

జి.మాడుగుల: శ్రీ రామ నవమి వేడుకలను పురస్కరించుకొని మండల కేంద్రంలో మెగా వాలీబాల్ టోర్నమెంట్‌ను మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నాయకుడు మత్స్యరాస బాలరాజు బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక స్థైర్యాన్ని ఇస్తాయని, గిరిజన యువత క్రీడల పట్ల దృష్టి సారించి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. పండుగలు, ఉత్సవాల్లో నిర్వహించే క్రీడల్లో గిరిజన యువతను ప్రోత్సహించి క్రీడా నైపుణ్యతను వెలికి తీసి ఉన్నత స్థానాలకు ఎదిగే విధంగా కృషి చేయాల్సి ఉందన్నారు. యువత క్రీడల్లో రాణించాలని కోరారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. మాజీ ఎంపీపీ మత్స్యరాస వెంకటగంగరాజు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సింహాచలంరాజు, ఆర్గనైజర్లు నారాయణరాజు, రామకృష్ణంరాజు, కూర్మరాజు, గిరి, నాయకుడు పెదబంగ్రరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆవాస ప్రణాళిక పక్కగా తయారుచేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో సీతయ్య

చింతపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు, ఉపాధ్యాయులతో ఎంపీడీవో లాలం సీతయ్య బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు పీవీటీజీ ఆవాస ప్రణాళిక పక్కగా తయారు చేయాలన్నారు. పీవీటీజీల ప్రణాళిక తప్పులు లేకుండా నమోదు చేసి నివేదికలు అందజేయాలన్నారు.నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. పనుల్లో నాణ్యత లోపిస్తే అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంఈవో ప్రసాద్, ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ కుళాయి ప్రారంభం


కొళాయిను ప్రారంభిస్తున్న ఎంపీపీ, నేతలు

కొయ్యూరు: బూదరాళ్ల పంచాయతీ పిట్టలపాడు, గరిమండలో గ్రామాల్లో ఇంటింటికి కొళాయి కనెక్షన్‌లను ఎంపీపీ బడుగు రమేష్ బుధవారం ప్రారంభించారు. బూదరాళ్ల పంచాయతీలో మారుమూల ప్రాంతాలుగా ఉన్న గ్రామాల్లో పనులు చేపట్టారు. ఎంపీపీ రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం శివారు గ్రామాల్లో కూడా ఇంటింటికీ కుళాయి పనులు చేపడుతోందన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. సర్పంచ్ ఎస్.ముత్యాలమ్మ, ఉప సర్పంచ్ మల్లేశ్వరరావు, ఎంపీడీవో మేరీరోజ్, మండల పార్టీ అధ్యక్షుడు బాబులు, నాయకులు సూరిబాబు, రమణబాబు, ఆనందరావు, సత్తిబాబు, మాధవరావు, శ్రీనుబాబు, వార్డు సభ్యులు సంజీవ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీపీ, నాయకులు తదితరులు వంతమర్రిలో జరిగిన బూదరాళ్ల ఎంపీటీసీ సభ్యురాలు వంతల కుమారి వివాహానికి హాజరయ్యారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జి.మాడుగుల: స్థానిక కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఆరో తరగతిలో–40 సీట్లు, 7,8,9, పలు సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరం –40సీటు ఖాళీలున్నట్టు ఆమె చెప్పారు. ఏప్రిల్ 20 తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని, లేనిపక్షంలో పాఠశాలను సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 94935 29235, 93910 24478 సంప్రదించాలని ఆమె అన్నారు.

ఆత్మవిశ్వాసంతో విజయం సాధ్యం


పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

డుంబ్రిగుడ: ఆత్మవిశ్వాసంతోనే విద్యార్థులు విజయం సొంతం చేసుకోవచ్చని పట్టాసి ఫౌండేషన్ ప్రతినిధి చలపతి అన్నారు. మండలంలోని కిల్లోగుడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గిరిజన సంక్షేమ శాఖ బాలుర పాఠశాలల్లో ఆయన బుధవారం సందర్శించారు. పదో తరగతి పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్, స్టేషనరీ అందజేశారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. హెచ్‌ఎంలు త్రినాథరావు, సంధ్యారాణి, అర్జున్, సంస్థ ప్రతినిధులు నారాయణ, జగజీవన్ పాల్గొన్నారు.

టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

డుంబ్రిగుడ/మారేడుమిల్లి/గంగవరం: డుంబ్రిగుడ, మారేడుమిల్లి, గంగవరం మండలంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుబ్బారావు, వెంకటరావు, అర్జున, తీగల ప్రభ, ఆదినారాయణదొర తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


బందవీధి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


గంగవరంలో పక్వాడా ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ కృష్ణారెడ్డి


రాజవొమ్మంగిలో ప్రదర్శించిన ఆహార పదార్థాలు


ఎటపాకలో అవగాహన కల్పిస్తున్న వైద్యులు

జి.మాడుగుల/గంగవరం/రాజవొమ్మంగి/ఎటపాక: జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. పోషకాహారంతోనే ఆరోగ్యం సిద్ధిస్తోందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పలు రకాలు పోషకాహర విలువలు గల ఆహర వంటకాలను తయారీ చేసి ప్రదర్శించారు. పోష్టికాహారం, చిరుధాన్యాల వినియోగంపై అవగాహన కల్పించారు. ర్యాలీ నిర్వహించారు. జి.మాడుగుల మండలం కె.కోడాపల్లి సర్పంచ్ చిలకమ్మ, వంతాల, బంధవీధి సెక్టర్ సూపర్‌వైజర్ సత్యవతి, గంగవరంలో ఐటీడీసీ సీడీపీవో సీహెచ్.లక్ష్మి,, ఎంపీపీ కృష్ణారెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారి కె.వి.ఎస్. సూపర్‌వైజర్ సత్యవతి, రాజవొమ్మంగిలో సీడీపీఓ దేవమణి, వైద్యాధికారి శ్రీదుర్గ, సూపర్‌వైజర్లు అరుణలత, నాగజయలక్ష్మి, అన్నపూర్ణ అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఎటపాకలో ఐసీడీఎస్ సీడీపీవో విమల, సూపర్‌వైజర్ రాధ, గౌరిదేవిపేట పీహెచ్‌సీ వైద్యులు దేవినాగ్, హెచ్‌విలు వాణి, లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వృథాగా తాగునీరు.. పట్టించుకోరూ


పైపులైన్ లీకుతో వృథాగా పోతున్న తాగునీరు

అనంతగిరి: మండల కేంద్రంలోని గత నాలుగు రోజులుగా తాగునీటికి మండలవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనంతగిరి, కొత్తవలస, మర్ధగుడ, మొండిజామిగుడ, హెక్టగుడ గ్రామాలకు ఆరేళ్ల క్రితం ప్రపంచబ్యాంకు ఆర్థిక సాయంతో సుమారు రెండుకోట్లతో గ్రావిటీ పథకం నిర్మించారు. నిర్మించిన కొద్దినెలలు తరువాత నుంచి తరుచూ మరమ్మతుకు గురవుతుందని స్థానికులు చెబుతున్నారు. మర్ధగుడ సమీపంలోని పథకానికి చేరే పైపులైన్‌లో రంధ్రం ఏర్పడి, తాగునీరు వృథాగా పోతుంది. దీంతో గత నాలుగు రోజులుగా తాగునీటి మండలవాసులు పరిస్థితి వర్ణాతీతంగా మారింది. గెడ్డలు ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని గిరిజనులు కోరుతున్నారు.

ఆలయ రథ నిర్మాణానికి విరాళం


రూ.50 వేలు విరాళం అందిస్తున్న గోగుల కుటుంబం

మునగపాక : మునగపాకలోని పంచాయతీ దరి పురాతన సీతారాముల ఆలయ రథం నిర్మాణానికి ఆలయ ధర్మకర్త గోగుల సీతారత్నం కుటుంబ సభ్యులు రూ.50 వేలు విరాళం ఇచ్చారు. ఈ నగదును ఆలయ నిర్వాహకులకు బుధవారం రాత్రి అందించారు. కార్యక్రమంలో ఆడారి లక్ష్మణరావు, ఆడారి అచ్చియ్యనాయుడు, జల్లేపల్లి కిష్టప్ప, మళ్ల జోగారావు, పాలిమేర కృష్ణ, ప్రసాద్, గోవింద, మాధవ, అర్చకులు పాల్గొన్నారు.

'ఆధార్ అప్‌డేట్ చేసుకోండి'

మునగపాక : ఆధార్ కార్డు అప్‌డేట్ శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పి.రవికుమార్ కోరారు. మండలంలోని వాడ్రాపల్లి సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ అప్‌డేట్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకుని, తమ ఆధార్‌కార్డుల్ని అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఈవోఆర్డీ ఈశ్వరరావు ఉన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు

రాజవొమ్మంగి: స్థానిక గిరిజన బాలికల జూనియర్ కళాశాల కేంద్రంగా జరుగుతున్న ఇంటర్మీడియేట్ పరీక్షలు బుధవారంతో ప్రశాంతంగా ముగిశాయి. ఈ కేంద్రంలో ఈనెల 15వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభమైన సంగతి విదితమే. ఈ పరీక్షా కేంద్రంలో 267 మంది జనరల్, ఒకేషనల్ కోర్సులు చదువుతున్న విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాశారు. ఇంటర్ పరీక్షలకు చివరి రోజు బుధవారం 10 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ ఈశ్వరప్రసాద్ తెలిపారు. బుధవారం కెమిస్ట్రీ–2, కామర్స్–2 పేపర్లకు 180 మంది హాజరుకావాల్సి ఉండగా 173 మంది పరీక్షలు రాసినట్టు చెప్పారు. ఒకేషనల్ కోర్సుకు చెంది 14 మంది హాజరు కావాల్సి ఉండగా 11 మంది మాత్రమే పరీక్షలు రాసినట్టు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాతంగా పరీక్షలు పూర్తయ్యాయని తెలిపారు.

సందడిగా ఫేర్‌వెల్ డే


చిన్నారుల నృత్యాలు


హాల్‌టిక్కెట్లు అందుకున్న పదో తరగతి విద్యార్థులతో జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం సందడిగా జరిగింది. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించి తల్లిదండ్రులు, చదువుకున్న పాఠశాల, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఉపాధ్యాయులు సత్యనారాయణ, అర్జమ్మ, బాబూరావు, ఎస్ఎంసీ చైర్మన్ వీరబాబు పాల్గొనగా ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు కుశరాజు, సత్యనారాయణ, రాణి, రాంబాబు పర్యవేక్షించారు.

రాజవొమ్మంగి: లాగరాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ వీడ్కోల కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు ఒడుగుల జ్యోతి విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. పరీక్షలు బాగా రాయాలని ఆకాంక్షించారు. హాల్ టిక్కెట్లు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

సర్పంచ్ మిరియాల గణలక్ష్మి, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ రాజుబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరమణ, తాతారావు, అంజిబాబు, రవి, హెచ్‌ఎం సూరారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలు తక్షణమే పరిష్కరించాలి


సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ రాఘవ, జెడ్పీటీసీ వీర్రాజు, అధికారులు

అడ్డతీగల: క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని మండల సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. ఎంపీపీ బొడ్డపాటి రాఘవ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలుచోట్ల విద్యుత్ లోవోల్టేజీ, తాగునీటి సరఫరాలో ఇబ్బందులు నివారించి, రోడ్ల సమస్యలను వివరించారు. దాకోడు, డి.రామవరం, దుశ్చర్తి పంచాయతీల్లోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా తరచూ నిలిచిపోవడం, లోవోల్టేజి సమస్యతో సతమతమవుతున్నట్టు ఎంపీటీసీ పల్లాల విశ్వమ్మ, దాకోడు, దుశ్చర్తి సర్పంచ్‌లు ఒండ్లోపు చిన్న దేవుడమ్మ, పల్లాల నూకరత్నం అన్నారు. తాగునీటి సరఫరా ట్యాంక్‌లకు మోటార్లు పనిచేయక తాగునీరు ఇబ్బంది ఉన్నట్టు తెలిపారు. డొడ్డివాకలో ఇదే పరిస్థితి ఉందని కిమ్మూరు సర్పంచ్ గుల్లెల రాజారెడ్డి అన్నారు. సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టాలని కోనలోవ సర్పంచ్ భూముల అర్జమ్మ చెప్పారు. సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ఉపాధ కూలీలకు సకాలంలో వేతనాలు, పైపులైన్ల లీకేజీల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు మద్దాల వీర్రాజు మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన ప్రతి పంచాయతీలో రోడ్లు ఇతరత్రా పనులకు ప్రభుత్వం రూ.20లక్షలు కేటాయిస్తోందన్నారు. ఆయా నిధులతో మౌలిక పనులు జరుగుతాయన్నారు. ఎంపీడీవో కె.బాపన్నదొర, తహసీల్దార్ శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి వేళాయె


చింతపల్లి రామాలయంలో పెళ్లిరాట వేస్తున్న భక్తులు


పూజలు చేస్తున్న మహిళలు

చింతపల్లి/కొయ్యూరు/గంగవరం: గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. రామాలయాలను సుందరంగా అలంకరించారు. చింతపల్లి, కొయ్యూరు ప్రాంతాల్లోని ఆలయాల్లో గురువారం ఉదయం జరగనున్న సీతారాముల కల్యాణ వేడుకకు భారీ ఏర్పాట్లు చేశారు. ఆలయాల ప్రాంగణంలో పెళ్లి రాట వేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించనున్నారు. చింతపల్లి రామాలయంలో ఆలయ ధర్మకర్త ఎం.సత్యానారాయణ ఆధ్వర్యంలో వేడుకలు జరగనున్నాయి. కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం రామాలయంలో పెళ్లిరాట ఏర్పాటు కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు నూకాలు, సర్పంచ్ సింహాద్రి, భక్తులు పాల్గొన్నారు. గంగవరం మండలంలోని మోహనాపురం, జగ్గంపాలెం, నెల్లిపూడి, మొల్లేరు, పిడతమామిడి, కొత్తాడ, జడేరు, గంగవరం గ్రామాల్లో శ్రీరామ నవమి ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉచిత ఆశ్రమ విద్యకు దరఖాస్తులు


ప్రచారం చేస్తున్న సంస్థ ప్రతినిధులు

వై.రామవరం: ఏలేశ్వరంలో ఉన్న స్వామి దయానంద సేవా ఆశ్రమంలో మండలంలోని పేద విద్యార్థులు ఉచిత ఆశ్రమ విద్యకు దరఖాస్తు చేసుకోవాలని అడ్డతీగలకు చెందిన పవనగిరి ట్రస్టు గురుస్వామిజీ తణుకు వెంకటరామయ్య పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన ఆధ్వర్యంలో గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. సేవా ఆశ్రమంలో 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి దరకాస్తులు చేసుకోవాలని, ప్రస్తుతం 4వ తరగతికి అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. ఈ ఆశ్రమంలో ఉచిత విద్య, భోజన వసతి సౌకర్యాలు ఉన్నాయన్నారు. పేద పిల్లలతోపాటు, అనాధ పిల్లలు, తల్లిదండ్రులు ఉండి కూడా చదివించడానికి స్తోమత లేనివారికి మొదటి ప్రాధాన్యత కల్పిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9491315362, 6302939374 సంప్రదించాలని పవనగిరి స్వామీజీ కోరారు.